క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పూజారి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోనా వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాలకు అభిషేకంతోపాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజలు చేపట్టారు.

టార్గెట్ బాల్ క్రీడల్లో ప్రతిభ


ప్రతిభ చాటిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

పాణ్యం: అసోసియేషన్ జూనియర్స్ మీట్ నిర్వహించిన టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో నంద్యాల జిల్లా మూడవస్థానంలో నిలిచింది. ఈ టీమ్‌లో పాణ్యం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులే అధికంగా ఉన్నారు. శనివారం ప్రిన్సిపాల్ దినేష్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 8న తూర్పు గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ క్రీడలు జరిగాయన్నారు. ఈ క్రీడల్లో నంద్యాల జిల్లా మూడవ స్థానంలో నిలువగా.. ఇందులో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారన్నారు. ఇందుకు కృషి చేసిన పీడీ కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి


వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ కాంతారావు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని నంద్యాల ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు సూచించారు. మండల కేంద్రమైన గడివేములలోని పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వరాలయానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ రామానుజన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీలోగా స్థానిక ఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి


గదుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు : పాఠశాలల్లో గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలోని కస్తూర్బా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద జరుగుతున్న గదుల నిర్మాణ పనులను సీపీఎం మండల కార్యదర్శి నాగన్నతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. పాఠశా లల్లో గదుల కొరతను గుర్తించిన గత ప్రభుత్వం నాడు-నేడు ద్వారా అదనపు గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. వాటి నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లయినా పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు శ్రీధర్, మధుసూదన్, మల్లేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు పెరిగిన వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి వరద నీటి ప్రవాహం పెరిగింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో బ్యారేజీకి శనివారం వరద నీటి ప్రవాహం కొంత పెరిగింది. దీంతో పాటు టీబీ డ్యాంకు సైతం స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యా నుంచి నీటి విడుదలను పెంచగా, ఆ నీటితో పాటు వేదావతి నది వరద నీటితో కలిసి మంత్రాలయం దగ్గర 53,500 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రస్తుతం బ్యారేజీకి 52 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఇందులో 12 క్రస్టు గేట్లు మీటర్ పైకెత్తి 49,632 కూసెక్కులు దిగువకు, కేసీ కాలువకు 2012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉద్యానవనం.. అధ్వానం

- పిచ్చి మొక్కలతో నిండిన పార్కులు
- నగర వాసులకు దూరమవుతున్న ఆహ్లాదం
- పార్కులు ఉన్నా వసతులు శూన్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కల్లూరు: కర్నూలు నగరంలో మొత్తం 52 వార్డులు ఉండగా అందులో 16 వార్డులు పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. అర్బన్ వార్డుల్లో సుమారుగా 2.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తుంది. అయితే అందుకు తగిన మౌలిక వసతులను మున్సిపల్ అధికారులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఉద్యానవనాల్లో పిచ్చి మొక్కలు

కల్లూరు అర్బన్ పరిధిలోని పలు ఉద్యానవనాలు పిచ్చి మొక్కల మయంగా మారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారిన జీవనశైలిలో భాగంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. కొంత సేపైనా కాలుష్యం లేని ప్రాంతంలో స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ ఆహ్లాదంగా గడపాలని అనుకుంటున్నారు. ఆయా కాలనీల్లో మున్సిపల్ పార్కులు ఏర్పాటు చేశారు గానీ ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో వృథాగా ఉన్నాయి. కొన్ని పార్కుల్లో ముళ్ల పొదలు, కంప చెట్లు పెరిగాయి. మరికొన్ని పార్కుల్లో మద్యం సీసాలు, చెత్త చెదారంతో నిండి ఉన్నాయి. పార్కులు వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ధనలక్ష్మి నగర్‌లోని పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు

☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న పార్కు ధనలక్ష్మి నగర్‌లోనిది. పార్కులోకి ధనలక్ష్మినగర్, నంద్యాల, నందికొట్కూరు రోడ్లకు సమీపంలో ఉండడంతో చాలా కాలనీలకు చెందిన ప్రజలు వాకింగ్ చేయడానికి వస్తారు. పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి పచ్చదనంతో నింపాలి. చిన్న పిల్లలకు ఆడుకునే పరికరాలు, యువకులు, పెద్దలు వ్యాయామం చేయడానికి పరికరాలు ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఆయా కాలనీల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేలా ట్రాక్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


సంక్షేమ భవన్ వెనక ఉన్న పార్కులో తిరుగుతున్న పందులు

☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న పార్కు సంక్షేమ భవన్ వెనకాల ఉంది. గేట్‌లు సరిగా లేకపోవడంతో ని త్యం పందులు, కుక్కలు తిరుగుతుంటాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ పార్కు పంది ల కు, కుక్కలకు ఆవాసంగా మారింది. అసాంఘిక కా ర్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కుల లోపల మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. పార్కు వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ట్రైబల్ వెల్ఫేర్ కాలనీలోని పార్కు దుస్థితి

☛ ఈ చిత్రంలో కనిస్తున్న పార్కు చుట్టూ ట్రైబల్ వెల్ఫేర్ నగర్, సిండికేట్ బ్యాంకు కాలనీ, కమేలా నగర్, శాంతనగర్‌తో పాటు వివిధ కాలనీలు ఉన్నాయి. వారందరి కోసం మున్సిపల్ అధికారులు పార్కును ఏర్పాటు చేసి అందులో వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట పరికరాలు, జిమ్ పరికరాలు మొదలగునవి ఏర్పాటు చేశారు. పార్కులో ఏర్పాటు చేసి న పరికరాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. అక్కడక్కడ ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కులను వినియోగంలోకి తీసుకురావాల ని చుట్టు పక్కల కాలనీల ప్రజలు కోరుతున్నారు.

అంజన్నకు పల్లకీసేవ


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: సకాలంలో వానలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ కోడుమూరు రైతులు శనివారం శ్రీఆంజనేయస్వామికి పల్లకీసేవా నిర్వహించారు. ముందుగా ఉదయం పెద్దబోయవీధిలోని ఆంజనేయస్వామి కట్ట వద్ద స్వామి వారికి భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి గ్రామపెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారు ఆశీనులైన పల్లకీతో రైతులు వెంకటగిరిలోని మసికొండకు కాలినడకన ఊరేగింపుగా వెళ్లి అక్కడ ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం తిరిగి కోడుమూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి గ్రామ సర్పంచు భాగ్యరత్న, గ్రామపెద్దలు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కేఈ.రాంబాబు, రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, మేళతాళాలతో స్వామివారిని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.

నిధులు లేకుండా పనులు ఎలా చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత


హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- సర్పంచులు, ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు లేవా?
- గూడూరు మండల మీట్‌లో అధికారులను ప్రశ్నించిన సభ్యులు

కోడుమూరు రూరల్: నిధులు లేకుండా తాము గ్రామాలలో పనులు ఎలా చేయాలంటూ మునగాల, చనుగొండ్ల సర్పంచులు గోపాల్, వెంకటేశ్వరమ్మ అధికారులను ప్రశ్నించారు. శనివారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధులత మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తాము పడుతున్న ఇబ్బందులపై సభలో ఏకరువు పెట్టారు. పంచాయతీలకు ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని, గతంలో చేసిన పనులకు కూడా ఇంకా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. అలాగే ఎంపీటీసీలు, సర్పంచులకు నెలల తరబడి గౌరవ వేతనాలు మంజూరు చేయడం లేదని, తాము ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామంటూ ఎంపీటీసీ సభ్యులు సువార్తమ్మ, రంగయ్య వాపోయారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ పంచాయతీలకు 15వ ఫైనాన్స్ నిధులను విడుదల చేసేలా, ఎంపీటీసీ సర్పంచులకు వేతనాలు మంజూరు కోసం ఉన్నతాధికారులకు లేఖ పంపాలని సూచించారు. వానలు పడుతున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకందించే మంచి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పైపులైన్ల లీకేజీలుంటే వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని, కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. కాగా మండల సర్వసభ్య సమావేశానికి చాలా శాఖల అధికారులు డుమ్మా కొట్టగా, వచ్చిన అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను చదివి మమా అన్పించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ శ్రీనివాసులు, ఏఓ దస్తగిరిరెడ్డి, ఎంఈఓ సునీలమ్మ, పీఆర్ నాగరాజు, కోఆప్షన్ మెంబర్ దౌల, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

గడివేముల: రక్త సంబంధం ఉన్నా, లేకున్నా అన్నా చెల్లెళ్లు, అక్క తమ్ముళ్లుగా బంధాని ప్రతీకగా రాఖీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం ఆయా గ్రామాల్లోని నేను నీకు రక్ష...నీవు నాకు రక్ష అంటూ అన్నచెల్లెళ్లు రాఖీ విశిష్టతను చాటి చెప్పారు.

ఉరుకుందలో భక్తజన సందడి


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి


క్యూ లైన్‌లో తరలివస్తున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ శనివారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. శ్రావణ శుక్రవారంతో పాటు రెండవ శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు సెలవు రోజులు కలిసి రావడంతో శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, విఐపీ దర్శనంల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగింది. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

గుట్టపాడు రోడ్డు.. గుంతల మయం


గుట్టపాడు రోడ్డుపై గుంతలు ఏర్పడిన దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు గ్రామానికి వెళ్లే రహదారిపై వేసిన తారు లేచిపోయి, కంకర మిగిలింది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై అక్కడక్కడ వేసిన ప్యాచీలు లేచిపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతుండటంతో దెబ్బతినింది. ఈ రోడ్డు ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా వుంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు రోడ్డు బాగోగులు పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఈ గ్రామానికి కూటమి చెందిన ఓ కీలక నేత ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

కుండపోత వర్షం

కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాలన్నీ నీట మునిగాయి. గ్రామాల రహదారులపై వాగులు ఎక్కి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. గూడూరు మండలంలో 69.8 మిల్లీమీటర్లు, సి.బెళగల్ మండలంలో 57.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

– కర్నూలు(రూరల్)

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- గూడూరు మండలంలో 69.8 మి.మీ వర్షం
- సి.బెళగల్‌లో 57.6 మి.మీ
- కర్నూలు మండలంలో దంచికొట్టిన వర్షం


పెద్దపాడు రస్తాలోని వాగుపై రాకపోకలు నిలిచిపోయిన దృశ్యం

● కర్నూలు మండలంలో..

కర్నూలు మండల పరిధిలో శనివారం తెల్లావారు జామున 3 నుంచి కురిసిన భారీ వర్షాలకు సుంకేసుల, ఆర్ కొంతలపాడు, తులాశపురం, ఆర్.కె. దుద్యాల, ఎదురూరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పాత జి.సింగవరం నుంచి కొత్త జి. సింగవరానికి రాకపోకలు సాగించే పెద్దపాడు వాగు పొంగిప్రవహించడంతో రాకపోకాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. పక్కన ఉన్న పొలాలు నీట మునిగాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు పెద్దపాడు దారిలోని వంతెన ఉదయం 10 గంటల వరకు ఉధృతంగా ప్రవహించింది.

● గూడూరు మండలంలో..


గూడూరు-కర్నూలు రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న వక్కెర వాగు

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలో కుండపోత వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏకదాటిగా వర్షం కురియడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 69.8మి.మీ వర్షం కురియడంతో పెంచికలపాడు వద్ద ఉన్న వక్కెర వాగు పొంగి ప్రవహించడంతో గూడూరు-కర్నూలు మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు కోడుమూరు మీదుగా గూడూరు, కర్నూలుకు వెళ్లారు. భారీ వర్షంతో వానల్లేక ఎండిపోతున్న పంటలకు ఊపిరి పోసిందని రైతులు తెలిపారు.

● సి.బెళగల్ మండలంలో..

సి.బెళగల్: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. మండలంలో 57.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం, మధ్యాహ్నం కూడా సి.బెళగల్‌తో పాటు పోలకల్, గుండ్రేవుల, ఇనగండ్ల, కొండాపురం, పలుకుదొడ్డి, చింతమానుపల్లె, తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో పైర్లు నీట మునిగాయి. అర్లవాగు, కొత్తకోట దగ్గర మునగాల వంక, చింతమానుపల్లె వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.


సి.బెళగల్ - గూడూరు దారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న అర్లవాగు


బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు

పర్లలో ఉప్పొంగిన వాగు

కల్లూరు: మండల పరిధి లోని పర్ల గ్రామానికి వెళ్లే మార్గంలో పెద్ద వంక, చిన్న వంకలు ఉప్పొంగ డంతో ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షం వల్ల పర్ల గ్రామ సమీపంలోని చిన్న వంక, పెద్ద వంక పొంగిపొర్లాయి. దీంతో ఊరు నుంచి వివిధ పనుల నిమిత్తం కర్నూలు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి, బయట ప్రాంతాల నుంచి గ్రామానికి వెళ్లడానికి వాగు ఉధృతి తగ్గేవరకు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెద్ద వాగు, చిన్న వాగు పరిసరా ప్రాంతాల చుట్టూ ఉన్న పొలాల్లో నీరు చేరింది.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుకున్న 1993–1999 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, ప్రస్తుత కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, గురుకుల విద్యాలయాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుత నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు తప్పకుండా హాజరై, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగుతున్న నీటి ప్రవాహం


గాలేరు నగరిలో ప్రవహిస్తున్న నీరు

పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వలకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గత నెల 30న గాలేరుకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం గాలేరుకు 13,500 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నారు. 5 వేల క్యూసెక్కుల నుంచి క్రమంగా 13500లకు పెంచి అవుకు రిజర్వాయర్‌కు వదులుతున్నారు. గోరుకల్లు జలాశయంలో ప్రస్తుతం 7 టీఎంసీల నీటిని నిల్వ ఉండగా.. ఎస్సార్బీసీకి 800 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 14వేల క్యూసెక్కుల నీరు వస్తుంది.